సాక్షి సిద్దిపేట

బుధవారం ၊ 6 ၊ సెప్టెంబర్ ၊ 2023

దంచికొట్టిన వాన

జిల్లాలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. సరిగ్గా నెల రోజుల విరామం తర్వాత వరుణుడు మళ్లీ విశ్వరూపం చూపాడు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. – దుబ్బాకటౌన్

జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- పలుచోట్ల దెబ్బతిన్న పంటలు
- నారాయణరావుపేటలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదు



దుబ్బాకటౌన్: భూంపల్లి వద్ద బ్రిడ్జికి ఆనుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు

జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. నారాయణరావుపేట, సిద్దిపేట, హుస్నాబాద్, అక్కనపేట, కోహెడ, దుబ్బాక, బెజ్జంకి, జగదేవ్‌పూర్, మర్కూక్, గజ్వేల్, నంగునూరు, మిరుదొడ్డి, తొగుట, చిన్నకోడూరు మండలాల్లో భారీగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరండతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కూడవెల్లి, మోయతుమ్మెద వాగులు..

ప్రధానమైన కూడవెల్లి, మోయతుమ్మెద వాగులు మళ్లీ పొంగిపొర్లుతున్నాయి. కూడవెల్లి వాగుపై నిర్మించిన 28 భారీ చెక్‌డ్యాంలు సైతం పూర్తిగా నిండాయి. కూడవెల్లివాగు భూంపల్లి వద్ద ఉన్న చిన్న బ్రిడ్జిని తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. తొగుటమండలం రాంపూర్ వాగుగడ్డవద్ద బ్రిడ్జి పైనుంచి వరద ఉరకలెత్తుతోంది. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎగువ మానేరు ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది.

చెరువులకు జలకళ

జిల్లాలోని 99 శాతానికి పైగా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. దుబ్బాక పట్టణంలోని రామసముద్రం, ఏదుల్ల చెరువులు, హుస్నాబాద్‌లో చెరవుల్లోకి భారీగా వరద నీరు చేరింది.

పంటలకు తీరని నష్టం

భారీ వర్షాలతో పలుచోట్ల పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. పెద్ద ఎత్తున వరద పంటపొలాలను ముంచెత్తింది. కూరగాయల తోటలు, మొక్కజొన్న, పత్తి పంటల్లో నీరు అధికంగా చేరడంతో దెబ్బతిన్నాయి. నాటేసిన వరిపొలాలు వరదనీటిలో మునిగిపోయాయి.

నారాయణరావుపేటలో అత్యధికం..

అత్యధికంగా నారాయణరావుపేటలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సిద్దిపేట రూరల్‌లో 9.5 సెం.మీ., అక్బర్‌పేట భూంపల్లిలో 7.5, కుకునూరుపల్లిలో 7.6, కొమరవెల్లి 6.3, హుస్నాబాద్‌లో 7.1, సిద్దిపేట అర్బన్‌లో 7.2, తొగుట 6.7, మిరుదొడ్డిలో 6.1, ములుగు 6.2, జగదేవ్‌పూర్, మర్కూక్‌లో 6.6, గజ్వేల్‌లో 5.4, దుబ్బాకలో 5.8, కోహెడ 5.6, చిన్నకోడూర్ 5.1, నంగునూర్ 6.1, దౌల్తాబాద్‌లో 5.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అత్యల్పంగా చేర్యాలలో 2.8సెం.మీటర్ల వర్షం పడింది. ఇదిలా ఉంటే జిల్లా మొత్తం మీద 5.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలు పంటలకు ఊపిరి పోశాయని రైతులు తెలిపారు.

పంటలకు మేలు..



ప్రస్తుతం కురుస్తున్న వర్షం పంటలకు చాలా మేలు చేస్తుంది. నెల రోజులుగా వానలు లేకపోవడంతో పంటలు ఎండు ముఖం పట్టాయి. వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటల్లో నీరు చేరింది. దీంతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. వెంటనే రైతులు నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి



దుబ్బాకలో రామసముద్రం చెరువు అలుగు వద్ద వరద ఉధృతి



దుబ్బాకటౌన్: చెక్‌డ్యాంపై నుంచి ప్రవహిస్తున్న వరద



చేర్యాల(సిద్దిపేట): బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న తాడూరు వాగు

న్యూస్‌రీల్

ఆశాలకు వేతనాలు పెంచండి



మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): వైద్య సేవల్లో పని చేస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు చెల్లించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నకోడూరు పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లు కొన్నేళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నా కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. టీబీ, లెప్రసీ, కంటి వెలుగు సంబంధించిన తదితర పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఆశాలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఆశాలు సంతోష, పద్మ, భార్గవి, విజయ, నీరజ, సుగుణ పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా ప్రయాణికుల ఎంపిక

సిద్దిపేటకమాన్: రాఖీ పండుగ సందర్భంగా గత నెల 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికుల్లో ఇద్దరు లక్కీ డ్రాలో ఎంపికయ్యారు. ఈ మేరకు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన బాలమణికి మొదటి బహుమతిగా రూ.25వేలు, కొమురవెల్లికి చెందిన కల్పన రెండో బహుమతి కింద రూ.15వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్టాండ్‌లో ఈ నెల 8న జరిగే కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ నుంచి వీరు బహుమతులు అందుకోనున్నట్లు డీఎం తెలిపారు.

పత్తి పంటల పరిశీలన



మర్కూక్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): అధిక సాంద్రత పత్తి పంటలు బాగున్నాయని కేంద్ర పత్తి పరిశోధన డైరెక్టర్ డాక్టర్ వైజీ ప్రసాద్, ఈసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ ఏఆర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శాస్త్రవేత్తల బృందంతో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తిని సాగు చేస్తే కేంద్ర ప్రభుత్వం రూ.6వేలను రైతు ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఈ పద్ధతిలో వంగడాల పంట కాలం తక్కువగా ఉండటమేకాక దిగుబడి అధికంగా వస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలకు మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏఓ నాగేందర్‌రెడ్డి, శాస్త్రవేత్తల బృందం రామకృష్ణ, రవి, వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పనులు వేగిరం చేయాలి



ప్రజ్ఞాపూర్‌లో బస్టాండ్ పనులను పరిశీలిస్తున్న ఈడీ పురుషోత్తం నాయక్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పలు బస్టాండ్ల పనులు వేగిరం చేయాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ అన్నారు. మంగళవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో నిర్మిస్తున్న ఆర్టీసీ మోడ్రన్ బస్‌స్టేషన్, పట్టణంలోని మినీ బస్‌స్టేషన్, ప్రజ్ఞాపూర్‌లో నిర్మాణంలో ఉన్న బస్టాండ్ పనులను పరిశీలించి సంబంధిత పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ అజయ్‌కు పలు సూచనలు చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుదర్శన్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ దైవాదీనం, డిప్యూటీ ఈఈ మనోహర్, జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపుగుర్రాలపై బీజేపీ ఫోకస్

అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- హుస్నాబాద్‌లో ఇద్దరి మధ్య పోటాపోటీ
- గజ్వేల్, సిద్దిపేటలో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ



సాక్షి, సిద్దిపేట: అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. ఈనెల 4 నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 10 వరకు ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల నుంచి బలమైన అభ్యర్థులను బరిలో దింపాలని పార్టీ కేంద్ర నాయకత్వం ఆలోచిస్తోంది. బలమైన అభ్యర్థులను ఎవరిని పోటీకి దింపాలన్న దానిపై కసరత్తు చేస్తోంది.

హుస్నాబాద్‌లో పోటాపోటీ..

హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఇద్దరు నాయకులు పోటాపోటీగా ప్రజల మధ్యనే ఉంటున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర హౌస్‌ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఇద్దరు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇద్దరు నేతలు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈటల రాజేందర్ అనుచరుడిగా సురేందర్ రెడ్డి, బండి సంజయ్ వర్గంలో శ్రీరాంచక్రవర్తి ఉన్నారు. ఇద్దరిలో ఎవరికి టికెట్ దక్కుతుందో చూడాలి. సిద్దిపేట నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి, నాయిని నరోత్తం రెడ్డి, బాలకృష్ణ, బైరి శంకర్, ఉడత మల్లేశం యాదవ్ ఆశిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్న వారు ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. దీంతో బలమైన అభ్యర్థిని పోటీ చేపించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. దుబ్బాక నుంచి ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు పోటీ చేయనున్నారు. గజ్వేల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. బీజేపీ నాయకుడు కప్పర ప్రసాద్‌రావు, గతంలో పోటీ చేసిన ఆకుల విజయ, వెంకట్ రమణలు టికెట్ ఆశిస్తున్న వారిలోఉన్నారు. జనగామ నియోజకవర్గం నుంచి దశమంతరెడ్డి, తిరుపతిరెడ్డి, సురేష్‌లు ఆశిస్తున్నారు, దరఖాస్తుల స్వీకరణ ముగిసిన తర్వాత మూడు స్థాయిల్లో అంటే జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి పరిశీలన చేయనున్నట్లు సమాచారం.

వివిధ కార్యక్రమాలతో ప్రజలకు వద్దకు..

పార్టీ కేంద్ర నాయకత్వం తెలంగాణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా విస్తృతంగా పార్టీ కార్యక్రమాలతో పాటు, కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. మేరా దేశ్.... మేరా మిట్టి పేరుతో పలువురి ఇళ్లలో మట్టిని సేకరించి ఆ పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించారు. హర్ ఘర్ బీజేపీ, లంచ్ బాక్స్ బైటెక్, ఎమ్మెల్యే ప్రవాస్‌యోజన కార్యక్రమాలకు అస్సాం రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే భుయాన్, సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల జిల్లాలోని ప్రముఖ వైద్యులు, వ్యాపారులను కలిసి కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తాం

- బీసీలకు రాజకీయాల్లో న్యాయమైన వాటా కావాల్సిందే
- బీసీ ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో గళమెత్తిన నాయకులు



గజ్వేల్‌లో ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళులర్పిస్తున్న బీసీ ఐక్య వేదిక నాయకులు

గజ్వేల్: హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తామని, రాజకీయాల్లో న్యాయమైన వాటాకోసం పోరాడుతామని గజ్వేల్‌లో నిర్వహించిన బీసీ ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు గళమెత్తారు. మంగళవారం పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాముల్ల అయిలయ్య, వర్గల్ జెడ్పీటీసీ బాలుయాదవ్, ములుగు మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోలా సద్గుణ, గజ్వేల్ పద్మశాలి సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్, వివిధ సంఘాల నాయకులు గుంటుకు శ్రీను, మల్లేశం, డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, మనోహర్ యాదవ్, కన్నాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే చూపిన బాటలో ముందుకుసాగుతామన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న తమకు తగు ప్రాధాన్యమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్వలాభం కోసమే బీసీ రాగం: బీఆర్‌ఎస్ నేతల మండిపాటు

గజ్వేల్‌లో కొందరు నాయకులు స్వలాభం కోసమే బీసీ రాగం ఎత్తుకున్నారని బీఆర్‌ఎస్ నాయకులు బెండె మధు, ర్యాగల దుర్గయ్య మండిపడ్డారు. మంగళవారం వివిధ మండలాలకు చెందిన బీసీ నాయకులతో కలిసి గజ్వేల్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ నిన్న, మొన్నటి వరకు మున్సిపల్ చైర్మన్లుగా, జెడ్పీటీసీలుగా పదవులను అనుభవించిన నేతలే నేడు బీసీ రాగం ఎత్తుకొని రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవుల్లో ఉన్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? అంటూ ప్రశ్నించారు. ఇలాంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలను సహించేదిలేదన్నారు.

'సెర్ప్' పనుల్లో పురోగతి ఏదీ?

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: సెర్ప్ నిర్వహిస్తున్న పనుల్లో పురోగతి లేదని, అన్ని కార్యకలాపాలను వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సెర్ప్ ఏపీఎం, డీపీఎం, శ్రీనిధి సిబ్బంది తో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశించిన మేరకు పనుల్లో పురోగతి లేనందున డీపీఎం ఇతర అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సెర్ప్ కార్యకలాపాలు స్వయం సహాయక మహిళా సంఘాల జీవనోపాధి లో మార్పు తీసుకురావాలన్నారు. అధికారులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. బ్యాంకు లింకేజి, పీఎంఎఫ్‌ఎంఈ తదితర విషయాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ రమేశ్, అదనపు డీఆర్డీఏ పీడీ రవీందర్ పాల్గొన్నారు.

'కేసీఆర్ నిర్ణయంలో మార్పుండదు'

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జహీరాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావు బరిలో ఉంటారని, సీఎం కేసీఆర్ నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండబోదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధినేత నిర్ణయించిన అభ్యర్థి కోసం పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సీఎం హ్యాట్రిక్ విజయంలో ఈ నియోజకవర్గ కూడా భాగస్వామ్యం కావాలన్నారు.

మల్లన్న సాగర్ అద్భుతం

సందర్శించిన 13దేశాల ప్రతినిధులు



మల్లన్నసాగర్ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ అద్భుతంగా ఉందని 13 దేశాల ప్రతినిధులు కితాబునిచ్చారు. మంగళవారం మల్లన్న సాగర్‌ను 30 మంది ప్రతినిధులు సందర్శించారు. పంప్‌హౌస్, డెలివరీ చానల్, రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈఈ చెన్ను శ్రీనివాస్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. ఎత్తిపోతల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్లను నిర్మించి తాగునీరు, సాగునీరు అందిస్తోందని వివరించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మించి సాగునీరు అందిస్తున్న తీరు చాలా బాగుందని అన్నారు.

మరింత బాధ్యత పెంచిన అవార్డులు



అవార్డులు పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

సిద్దిపేటజోన్: ఉత్తమ సేవలకు అవార్డులు లభించాయని, ఈ అవార్డులు వారిలో మరింత బాధ్యత పెంచాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక టీటీసీ భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోజాశర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంతో సేవలు అందించాలన్నారు. జిల్లాలోని ఇద్దరు టీచర్లు రాష్ట్రస్థాయి అవార్డులు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా నుంచి ఇంకా పెద్ద సంఖ్యలో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. భావితరాలకు బంగారు బాటలు ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, సబితారెడ్డి నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు అందుకుంటున్న ఉపాధ్యాయులు (కుడి నుంచి..) వరాల ప్రశాంత్‌కుమార్, దామరశెట్టి రవివర్మ, కె. శ్రీనివాస్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేటరూరల్: మతిస్థిమితం కోల్పోయిన యువకుడు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఉడుత శ్రీనివాస్ (24) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ క్రమంలో రాఖీ పండగ సందర్భంగా సొంతూరికి వచ్చాడు. కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేని శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించగా పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే పోటీలకు..



కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీలకు గజ్వేల్ మండలం కొడకండ్లలోని ఆల్ఫా ఒమేగా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రేమ్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎండీ రెహాన్, 5వ తరగతి ఎండీ అఫ్రోజ్ ఈనెల 8, 9, 10, 11 తేదీలలో రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఖేల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరాటే కోచ్ నరేష్ పాల్గొన్నారు.

రెండో వివాహం చేసుకున్నందుకు జైలు

సదాశివపేట(సంగారెడ్డి): కట్టుకున్న భార్యతో కాపురం చేస్తూనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్న వ్యక్తికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు మహిళ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ మహేశ్‌గౌడ్ తెలిపారు. సదాశివపేట గురునగర్ కాలనీకి చెందిన మీర్జాపూర్ కృష్ణవేణితో జహీరాబాద్ గుల్షన్‌నగర్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మీర్జాపూర్ జగన్నాథ్‌తో మార్చి 20, 2010న వివాహం జరిగింది. వరకట్నం కింద 15 తులాల బంగారం, 50 తులాల వెండి వస్తువులతో పాటు రూ.5లక్షల నగదు ఇచ్చారు. పెళ్లి అయిన 20 రోజుల నుంచే అత్త సిద్దమ్మ అదనపు కట్నం తీసుకురావాలని కృష్ణవేణిని మానసికంగా వేధించడం మొదలుపెట్టింది. ఆమెకు తోడు ఆడపడుచు భవాని, ఆమె భర్త అంజన్న, మామ రమేష్‌బాబులు తరచూ గొడవపడేవారు. హోతిబి గ్రామంలోని వ్యవసాయ భూమిని కృష్ణవేణి భర్త జగన్నాథ్‌పై చేయించాలని వేధించారు. ఈ సమయంలోనే కృష్ణవేణి గర్భవతి అయ్యి బాబుకు జన్మనిచ్చింది. అయినా భర్త, అత్తమామల్లో మార్పురాలేదు. స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టులో కృష్ణవేణి పిటిషన్ వేసింది. కేసు పెండింగ్‌లో ఉండగా కులపెద్దలతో పంచాయతీ నిర్వహించారు. ఇప్పటి నుంచి బాగా చూసుకుంటామని చెప్పడంతో కేసు విత్‌డ్రా చేసుకున్న కృష్ణవేణి కాపురానికి వెళ్లింది. భర్త మద్యంకు అలవాటై ప్రవర్తనలో మార్పు రాలేదు. అనుమానం వచ్చి ఆరా తీయగా.. 2014లో శిరీష అనే అమ్మాయిని జగన్నాథ్ రెండో వివాహం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై నిలదీయగా కృష్ణవేణిని ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీనిపై సంగారెడ్డి మహిళ పోలీస్ స్టేషన్‌లో జూన్ 2017లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. విచారణ జరిపిన సీఐ వెంకటన్న కోర్టుకు నివేదించారు. నేరం రుజువుకావడంతో జగన్నాథ్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి షాలిని షాకెల్లి మంగళవారం తీర్పు చెప్పారని ఎస్‌హెచ్ఓ మహేశ్‌గౌడ్ తెలిపారు.



- 1,75,719 మంది రైతులకు ప్రయోజనం
- ఇప్పటివరకు రూ.447.23 కోట్ల మాఫీ ప్రక్రియ పూర్తి

గజ్వేల్ : జిల్లాలో పంట రుణాల మాఫీ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం ముందుకు సాగుతుంది. జిల్లాలోని 175719మంది రైతులకు రూ.1360.49కోట్ల మాఫీ వర్తించింది. ఇప్పటివరకు 83116 మంది రైతులకు చెందిన రూ.447.23కోట్ల మాఫీ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో కొన్నేళ్లుగా రుణమాఫీ సమస్య కారణంగా పంటరుణాలు సక్రమంగా అందక రైతులు నానా ఇక్కట్లు పడుతూ వస్తున్నారు. మాఫీ వస్తుందనే ఆశతో రుణాలు రెన్యూవల్ చేయకపోవడం వల్ల రైతులకు కొత్త రుణాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో పంట పెట్టుబడుల కోసం అన్నదాతలు ఏటా సీజన్‌లో వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పంటల దిగుబడి ఆశించినంత రాక, అప్పులు తీరక అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఈ పరిస్థితి వల్ల ఏటా జిల్లాలో రుణవితరణ సక్రమంగా సాగటం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన కొత్త రుణాల లక్ష్యంలో బ్యాంకర్లు 65శాతానికి మించి ఇవ్వడం లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఈ క్రమంలోనే రుణమాఫీ పూర్తిచేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం రైతులకు ఊరటనిస్తుంది. 2014 ఏప్రిల్ 1 నుంచి, 2018 డిసెంబర్ 11వరకు ఉన్న రుణాలను మాఫీ చేయడానికి నిర్ణయించిన సంగతి తెల్సిందే. దీని ప్రకారం జిల్లాలో 175719మంది రైతులకు సంబంధించి రూ.1360.49కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. ఇందులో ఇప్పటివరకు 83116మంది రైతులకు చెందిన రూ.447.23కోట్ల రుణాలను మాఫీ చేసే ప్రక్రియ పూర్తయ్యింది. ఇందులో 75362మంది రైతులకు సంబంధించిన రూ.401.86కోట్ల రుణమాఫీ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన 7754 మందికి చెందిన రూ.45.37కోట్ల రుణమాఫీ మొత్తాన్ని జమ చేయడానికి ఎకౌంట్ క్లోజ్డ్, బ్లాక్డ్, తప్పుడు ఖాతాలు వంటి సమస్యలు ఉండగా, వాటిని సరిచేసే ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.10లక్షల వరకు రుణమాఫీ వర్తింపజేస్తూ రైతులను రుణ విముక్తుల్ని చేస్తున్నారు.

నిర్దేశించిన గడువులోగా రుణమాఫీ పూర్తి చేస్తాం

ప్రభుత్వం మరో నెల రోజుల్లో వందశాతం రుణమాఫీ పూర్తి చేయాలని ఆదేశాలిచ్చింది. ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా బ్యాంకర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. రుణాలు ఇప్పటికే చెల్లించిన రైతులు తమ అకౌంట్లతో రుణమాఫీ మొత్తం పడినట్లుగా మెసేజ్‌లు వస్తే ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్ తీసుకెళ్లి బ్యాంకర్ల చూపించి ఆ డబ్బులను డ్రా చేసుకోవచ్చు. – లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్

వంద శాతం లక్ష్యం చేరుకునేదెప్పుడు?

జిల్లాలో వర్తించిన రుణమాఫీలో ఇప్పటివరకు 33శాతం వరకు పూర్తిచేసిన అధికారులు వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటేనే రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరనుంది. ఇకపోతే ఎకౌంట్ క్లోజ్డ్, బ్లాక్డ్, తప్పుడు ఖాతాలు వంటి సమస్యలతో కొందరు రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. బ్యాంకర్ల చుట్టూ తిరిగినా సరైన సమాధానం రాక ఇబ్బందిపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు మాఫీ వర్తిస్తుందా..? లేదా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. గ్రామం యూనిట్‌గా తీసుకొని రుణమాఫీ పూర్తి చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలోకి బ్యాంకర్లు సక్రమంగా వెళ్లక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగాల్సిన అవసరమున్నది.

భార్య మృతికి కారకుడైన భర్తకు ఏడేళ్లు జైలు

సిద్దిపేటకమాన్: వరకట్న వేధింపులకు భార్య ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. తొగుట మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన పోతుల బాబుతో కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన రజితతో 2014 మార్చి, 22న వివాహం జరిగింది. ఆ సమయంలో బంగారం, వెండి, ఇతర కట్న కానుకలు ఇచ్చారు. పెళ్లి అయిన కొన్నిరోజుల తర్వాత అతడు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసి, తర్వాత దుబాయికి వెళ్లి ఒక సంవత్సరం ఉండి వచ్చాడు. తర్వాత అదనపు వరకట్నం కావాలని రజితను శారీరకంగా, మానసికంగా వేధించాడు. పెద్దల సమక్షంలో రాజీ కుదర్చడంతో సిద్దిపేటలో నివాసం ఉన్నారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో రజిత 2017 మార్చి 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి అల్లుడు బాబు కారణమంటూ మృతురాలి తల్లి సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ నర్సింహారెడ్డి కేసు పరిశోధన చేపట్టి నేరస్థుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పూర్తి పరిశోధన అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా అప్పటి నుంచి విచారణ చేసిన అనంతరం జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్ కోర్టు జడ్జి టి.రఘురాం ఇరువురి వాదనలు విన్న తర్వాత బాబుపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సిద్దిపేట ఏసీపీ తెలిపారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి, గృహిణి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.13 లక్షలు, ఓ గృహిణి 1.64 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని ఆర్‌ఆర్ హోమ్స్ కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 23వ తేదీన పార్ట్‌టైం జాబ్ పేరిట వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. స్పందించిన ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం 13లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు మంగవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన గృహిణికి ఆగస్టు 22వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. అందులో ఆమె వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ, ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. దాంతోపాటు మొత్తం రూ. లక్షా 64 వేలు ఇన్వెస్ట్ చేసింది. చివరికి తాను పెట్టిన డబ్బుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా బహుళ అంతస్తులు



కొమురవెల్లిలో పర్మిషన్ లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

- కొమురవెల్లిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు
- జీప్లస్ టూకు పర్మిషన్.. నిర్మాణం జీప్లస్ ఫోర్
- మామూళ్ల మత్తులో గ్రామపంచాయతీ అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో వసతి గదులకు భలే డిమాండ్ ఉంటుంది. దీంతో కొందరు బడా బాబులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు ఇల్లు నిర్మించుకోవాలంటే సవాలక్ష నిబంధనలు చూపి కొర్రీలు పెట్టే పంచాయతీ అధికారులు బహుళ అంతస్తుల జోలికి పోవట్లేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో జీ ప్లస్ టూ నిర్మాణానికి మాత్రమే అవకాశం ఉంది. ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేపట్టాలంటే డీటీపీసీ నుంచి పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పంచాయతీ అధికారులు అడ్డగోలుగా జీ ప్లస్ టూకు పర్మిషన్ ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించి కొందరు జీ ప్లస్ ఫోర్ వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామంలో గతంలో సెట్ బ్యాక్ చేయలేదని సామాన్యురాలి బిల్డింగ్‌ను గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఇప్పుడు కొందరు పర్మిషన్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మాణం చేపడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికంగా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లోకేష్ రెడ్డిని వివరణ కోరగా.. గ్రామ పంచాయతీలో అనేక పనులు ఉన్నా యని , ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప చర్యలుండవని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

విచారణ చేపడుతాం

కొమురవెల్లిలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్న విషయం ఇప్పుడే తెలిసింది. రెండు మూడు రోజుల్లో విచారణ చేపటి చర్యలు చేపడుతాం. గ్రామ పంచాయతీల్లో జీ ప్లస్ టూకే పర్మిషన్ ఉంటుంది.

– దేవకీ దేవి, జిల్లా పంచాయతీ అధికారి

గ్రౌండ్ ఇలా.. ఆడేదెలా?



బురదమయమైన ఫుట్‌బాల్ గ్రౌండ్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఇదే ఆవరణలో ఆర్‌టీఏ కార్యాలయం ఉండడంతో వివిధ రకాల లైసెన్సులు, అనుమతుల కోసం వచ్చే వాహనాలను ఈ గ్రౌండ్‌లోనే ట్రయల్స్ నిర్వహిస్తుంటారు. దీంతో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయిందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 1 నుంచి 13వ తేదీ వరకు సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ నేషనల్ క్యాంప్(శిక్షణ శిబిరం) కొనసాగుతుంది. వాహనాల ట్రయల్స్‌తో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రౌండ్ పూర్తిగా బురదమయమై చిత్తడిగా మారిందని వాపోయారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి క్రీడాకారులకు అనువుగా ఉండేలా ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

వర్షాలతో వరికి తెగుళ్లు

- సీనియర్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ శోభ



నర్సాపూర్ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పంటకు అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఎండు తెగులు, ఉల్లి కోడు తెగులు, మోగి పురుగు లేదా సిగపురుగు తెగులు తో పాటు ఆయా రకాల తెగులు సోకే అవకాశం ఉందని నర్సాపూర్ మండలం నత్నయ్యపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శోభ బుధవారం తెలిపారు. ప్రధానంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు మూడు లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తున్నట్లు చెప్పారు. భారీగా కురుస్తున్న తెలిపారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటిస్తూ పంటను కాపాడుకోవాలని అన్నారు. తెగుళ్ల నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో ఆమె వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ ప్లస్ మాన్కోజెబ్ కలిపిన మందు 2.5 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటమైసిన్ గ్రాములు 10 లీటర్స్ నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉల్లికోడు నివారణకు పిప్రో నిల్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మోగి, సిగ పురుగు నివారణకు క్లోరాంత్రానిలిప్రోల్ గుళికలను నాలుగు కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కిలోలు ఒక ఎకరానికి చొప్పున వేసుకోవాలి. మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు నేరుగా అవకాశం లేకుంటే ఫోన్ నంబర్ 9963468360 ద్వారా సంప్రదించి వాట్సాప్, వీడియోల ద్వారా వరికి సోకిన తెగుళ్ల సమస్యకు పరిష్కారం తెలుసుకోవచ్చని శాస్త్రవేత్త శోభ తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సెలెస్టియల్ హైస్కూల్ (ఇంగ్లిష్) బెస్ట్ టీచర్ షీమాఫర్వీన్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం





మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు,లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, పాల్గొన్న అధికారులు

సిద్దిపేటకమాన్: ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో లిస్టు అవుట్ చేసిన కేసుల్లో సంబంధిత కక్షిదారులను పిలిపించి డిస్పోజల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీలు లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, అడ్మిన్ శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సీఐలు, ఎస్ఐలు, రైటర్లతో రోడ్డు ప్రమాద కేసుల్లో నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ వాహనాల రూల్స్ గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద కేసులు జరిగినప్పుడు నూతనంగా ప్రవేశపెట్టిన ఫామ్ 1 నుంచి 10వరకు అన్ని వివరాలు పొందుపరిచి, ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి సరైన సమయంలో పంపించాలని సూచించారు. దీంతో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్ త్వరగా ఎగ్జిగ్యూట్ చేయాలని అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఇరువురికి సత్వర న్యాయం జరుగుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. నూతన టెక్నాలజీ 2.0 వెర్షన్‌లో ఎఫ్ఐఆర్, సీడీఎఫ్, ఇతర అన్ని వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్ పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాద కేసుల్లో నూతన మోటార్ వాహనాల నిబంధనల గురించి ట్రాఫిక్ పోలీసు అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి, వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాష్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



అరిగె సాయిలు (ఫైల్)

ఆర్టీసీ కండక్టర్..

హవేళీఘనపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. మండల పరిధిలోని నాగాపూర్ గ్రామానికి చెందిన చాకలి అంజయ్య(50) మెదక్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం రాత్రి 12గంటలకు డ్యూటీ ముగించుకొని స్వగ్రామం నాగాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. హవేళీఘనపూర్ దాబా వద్ద ఎల్లారెడ్డి నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

చేగుంట(తూప్రాన్): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రెడ్డిపల్లి శివారులోని 44వ జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలవకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రామాయంపేట మార్చురీకి తరలించినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుందని, ఎవరైనా గుర్తిస్తే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పడుకున్న చోటే వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించి పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌కు చెందిన కేవీఎస్పీఎల్ఎస్ ఆచార్య(44) పదిరోజుల క్రితం పటాన్‌చెరు మండలం పోచారం గ్రామ పరిధిలో ఉన్న ఉపేందర్ ఫామ్‌హౌస్‌లో పనికి చేరాడు. ఈ క్రమంలో ఆచార్యకు ఫామ్‌హౌస్ యజమాని ఉపేందర్ సోమవారం ఫోన్ చేయగా తీయలేదు. అనుమానం వచ్చి చూడగా పడుకున్న చోటే ఆచార్య మృతిచెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి జయప్రకాశ్ ఆచార్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.